

Postal License No.VJ/220/2023-25

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL


Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 8-15 ఏప్రిల్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 44 | పేజీలు : 4 | రూ. 5.00


## ఫిర్యాదుల పరిష్కారాల్లో వేగం పెంచాలి: సీఎం



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రజా ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో మరింత వేగంగా స్పందించాలని, ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులకు గ్రీవెన్స్ స్థితిని తెలియజేసే సమాచారం అందించాలని, ఇందుకోసం ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగే వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని చెప్పారు. అలాగే పరిష్కరించలేని వినతుల విషయంలో ఫిర్యాదుదారులకు ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని సవివరంగా తెలియజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌ల పరిష్కారంపై మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్షించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా తీసుకోవడం ద్వారానే గ్రీవెన్స్ నమోదు చేయాలని, దీని ద్వారా నకిలీ ఫిర్యాదులు అరికట్టవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే, ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా, వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఒకే విషయంపై అదే పనిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తూ ఉంటే, అటువంటి వారి వివరాలు సేకరించి, ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వినతులు పరిష్కరించిన తర్వాత ఎవరైతే గ్రీవెన్స్ దరఖాస్తు చేశారో వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. తనకు నేరుగా వచ్చే గ్రీవెన్స్‌లను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారులతో సంప్రదించి ఫాలోఅప్ చేయడం ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్.. కేవలం ఈ 3 శాఖల నుంచే అత్యధికంగా ఫిర్యాదులు, వినతులు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ప్రభుత్వం రీ సర్వేలో నిబంధనలు ఉల్లంఘించడంతో భూ సంబంధిత ఫిర్యాదులు పెరిగాయి. ఫిర్యాదుల్లో ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో భూ యజమాని పేరు మారిపోవడం, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్ల సవరణ, రీ సర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువగా ఉన్నాయి. అలాగే, పోలీస్ శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, సైబర్ క్రైమ్, వైవాహిక సమస్యలు, భూ సంబంధిత తగాదాలు, ఆర్థిక నేరాలతో ముడిపడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. మున్సిపల్ శాఖలో కూడా ఫిర్యాదులు ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తి పన్నులు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు వివరించారు.

## దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరి 100 పడకల ఆసుపత్రి: నారా లోకేశ్



మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి నిర్మాణం. తనను 91వేల భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపడంతో మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కలను నెరవేర్చేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సిద్ధమయ్యారు. అత్యాధునిక వసతులతో దేశానికే రోల్ మోడల్‌గా ఆసుపత్రి నిలిచేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు.

**దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం..** ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవన నమూనాలు, ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో పనిచేసేలా చూడాలన్నారు. ఏడాదిలోగా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేయాలని గడువు విధించారు.

**1,15,000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి భవన నిర్మాణం..** చినకాకాని వద్ద 100 పడకల ఆసుపత్రికి కేటాయించిన 7.35 ఎకరాల్లో 1,15,000 చదరపు అడుగుల్లో అత్యంత విశాలంగా ఆసుపత్రి భవనాన్ని నిర్మించనున్నారు. 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి రూ. 52.20 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం జీ ప్లస్ వన్ విధానంలో ఆసుపత్రిని నిర్మిస్తుండగా భవిష్యత్తులో విస్తరించుకునే అవకాశం ఉంది. ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు 3 ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్, మంత్రి నారా లోకేశ్ గారి సూచనల మేరకు తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**యువగళం హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..** యువగళం పాదయాత్రలో భాగంగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని నారా లోకేశ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది అక్టోబర్ 23వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విషయాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించడంతో మంగళగిరి ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంతగా కొట్లాడి మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని ఎన్నికల సమయంలో నారా లోకేశ్ పేర్కొన్నారు. అన్నట్లుగా రాష్ట్రంలోనే మూడో భారీ మెజార్టీ సాధించడంతో మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు.

**మంగళగిరి ప్రజల దశాబ్దాల కల..** 1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ మంగళగిరిలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. కాలక్రమేణా ఆసుపత్రి నిరాదరణకు గురికావడంతో కేవలం ఓపీ సేవలకు మాత్రమే పరిమితమైంది. అనేక సంవత్సరాలుగా మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచాలంటూ ప్రజలు ప్రత్యేక కమిటీలుగా

(తరువాయి.. 2 వ పేజీలో)

## ఊరికే లేఖ రాసి చేతులు దులుపుకోవడం కాదు: చంద్రబాబుపై జగన్ విమర్శలు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉంటే నిద్రపోతున్నారా? అంటూ సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా టారిఫ్‌ల దెబ్బ ఒకటైతే, ఆపేరు చెప్పి మీ పార్టీకి చెందిన వ్యాపారులంతా సిండికేట్ అయి రైతులను దోచుకుతింటుంటే ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు? అని మండిపడ్డారు. ట్రంప్ టారిఫ్ ల ప్రభావం ఆక్వా రంగంపై పడుతోందని, కేంద్రం చర్యలు తీసుకోవాలంటూ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడంపై జగన్ స్పందించారు. రోజు రోజుకూ ధరలు పతనం అవుతున్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదు? ప్రభుత్వ స్థాయిలో ఒక రివ్యూ చేసి, గట్టి చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు? రైతులంతా గగ్గోలు పెడితే, మీడియా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలదీస్తే కేంద్రానికి ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగన్ నిలదీశారు. ఇక ప్రభుత్వం ఉండీ ఏం లాభం? అని విమర్శనాస్త్రాలు సంధించారు. "100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ. 280 నుంచి దాదాపు రూ. 200–210కి పడిపోయింది. ఈ ధరలు ఇంకా తగ్గుతున్నా, క్రాప్ హాలిడే తప్ప వేరే మార్గం లేదని రైతులు కన్నీళ్లు పెడుతున్నా ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? ఎగుమతుల్లోనూ, అలాగే విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించడంలోనూ రాష్ట్ర ఆక్వారంగం దేశంలోనే నంబర్ వన్. అలాంటి రంగాన్ని మరింతగా ఆదుకోవడానికి ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీని మా హయాంలో ఏర్పాటు చేశాం. ఆక్వా సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించడంతోపాటు నాణ్యత పాటించేలా ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాం. సిండికేట్‌గా మారి దోపిడీచేసే విధానాలకు చెక్ పెడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రొయ్యలకు ధరలు నిర్ణయించాం. కోవిడ్ సమయంలో దాదాపు ఐదేళ్ల క్రితం 100 కౌంట్‌కు, ఆ రోజుల్లో కనీస ధరగా రూ. 210లు నిర్ణయించి రైతులకు బాసటగా నిలిచాం. మూడుసార్లు ఫీడ్ ధరలు తగ్గించాం. ఇప్పుడు ఫిష్ ఆయిల్, సోయాబీన్ సహా ముడిసరుకుల దిగుమతులపై సుంకం దాదాపు 15% నుంచి 5% తగ్గినా ఈ కూటమి ప్రభుత్వంలో ఫీడ్ ధరలు ఒక్కపైసా కూడా తగ్గలేదు. గతంలో చంద్రబాబు హయాంలో ఆక్వాజోన్ పరిధిలో కేవలం 80–90 వేల ఎకరాలు ఉంటే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ జోన్ పరిధిలోకి 4.22 లక్షల ఎకరాలు తీసుకువచ్చాం. ఆక్వా రంగంలో మొత్తం 64 వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే అందులో జోన్ పరిధిలో ఉన్న 54 వేల కనెక్షన్లకు రూ. 1.50కే యూనిట్ కరెంటు అందించాం. దీనికోసం రూ. 3,640 కోట్లు సబ్సిడీ కింద ఖర్చుచేశాం. ఆక్వాజోన్స్‌లో ఉన్న ఆర్బీకేల్లో ఫిషరీస్ గ్రాడ్యుయేట్లను ఆక్వా అసిస్టెంట్లుగా నియమించి రైతుకు చేదోడుగా నిలిచి, ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపించాం. అమెరికా టారిఫ్‌ల పేరుతో రైతుల్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. ఈ టారిఫ్‌లు అన్నవి కేవలం మన దేశానికి మాత్రమే పరిమితమైనవి కావు, ఇక ముందుకూడా ఇవి కొనసాగుతాయి. ఊరికే ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం కాదు" అంటూ జగన్ తీవ్రస్థాయిలో స్పందించారు.

## శ్రీరాముని స్ఫూర్తితో పాలన సాగిస్తా: సీఎం చంద్రబాబు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శ్రీరాముని ఆదర్శాలతో పాలించి, రామరాజ్యంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన, రాములవారి ఆశీస్సులతో రాష్ట్రాన్ని సుభిక్షంగా మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, సీతారాముల కల్యాణం ఎంతో వైభవంగా జరిగిందని, వారి దాంపత్యం అందరికీ ఆదర్శమని కొనియాడారు. "పరిపాలన అంటే శ్రీరాముని పాలనలా ఉండాలి. అప్పుడే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారు" అని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలంలో రాములోరి దర్శనం చేసుకునే అవకాశముండేదని, విభజన తర్వాత ఒంటిమిట్టలో కోదండరాముడి కల్యాణాన్ని ప్రభుత్వపరంగా అత్యంత వైభవంగా జరపాలని నిర్ణయించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఒంటిమిట్ట ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరిధిలోకి తీసుకురావడం జరిగిందని, ఆలయ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. టెంపుల్ టూరిజంలో భాగంగా ఒంటిమిట్ట ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ఆలయ ప్రాంగణంలోని చెరువును సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు రెండు మూడు రోజులు ఉండేలా అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయాలు మన వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని ఆయన నొక్కి చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ అగ్రగామిగా నిలుస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. తన దృష్టిలో రామరాజ్యం అంటే స్వర్ణాంధ్రప్రదేశ్‌ను నిర్మించడమేనని, పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఆర్థిక అసమానతలు తగ్గించి, సుభిక్షమైన రాష్ట్రాన్ని నిర్మిస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. శ్రీరాముని స్ఫూర్తితో ప్రజారంజక పాలన అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

## ఆడవాళ్ల వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు: సీఎం చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. ఏలూరు జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, తప్పులు చేసే వారి పట్ల చండశాసనుడిగా ఉంటానని స్పష్టం చేశారు వైసీపీ హయాంలో రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని, ఇప్పుడు తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని అన్నారు. వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ పై కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకున్న నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాడు అసెంబ్లీలో తనను బూతులు తిట్టారని చంద్రబాబు వెల్లడించారు. అది కౌరవ సభ అని, గౌరవ సభగా మారాకే మళ్లీ సీఎంగా అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పానని గుర్తు చేసుకున్నారు. ఆడపిల్లల వ్యక్తిత్వాల గురించి చెడుగా మాట్లాడితే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో బీసీ సంరక్షణ చట్టం తీసుకువస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మహాత్మా జ్యోతి రావు పూలే గారి స్ఫూర్తితో ఈచట్టం తెస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వచ్చాకే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగిందిన అన్నారు. బీసీలకు ఉద్యోగాల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. జిల్లాల వారీగా బీసీ భవన్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో బీసీ విద్యార్థుల కోసం సివిల్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు ఇస్తున్నామని, ఈ ఏడాది లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. త్వరలోనే అందరికీ తల్లికి వందనం అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా, రాష్ట్ర రైతాంగానికి అండగా ఉంటామని, లాభదాయకమైన వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని తెలిపారు. మే నెల నుంచి రైతులకు విడతల వారీగా రూ. 20 వేలు అందజేస్తామని వివరించారు. కోర్టు సమస్యలు పరిష్కరించి త్వరలోనే చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు.

పీ–4తో సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. సంపద అనేది ఒకరికే పరిమితం కాకూడదని అభిప్రాయపడ్డారు. 10 మంది సంపన్నులు 20 మంది పేదలకు చేయూతనివ్వాలన్నదే తమ అభిమతం అని వివరించారు. ఆగిరిపల్లిలో 206 పేద కుటుంబాలను గుర్తించామని, అర్హులందరికీ స్థలం ఇచ్చి ఇల్లు కట్టాకే మళ్లీ ఓట్లు అడుగుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అనువుగాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని విమర్శించారు.

## 33 మందితో వైసీపీ రాజకీయ సలహా సంఘం... కన్వీనర్ గా సజ్జల

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :వైసీపీ అధినేత జగన్ ఇవాళ తమ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని ప్రకటించారు. ఈ పీఏసీలో 33 మంది సభ్యులు ఉన్నారు. ఎంపీలు అవినాశ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు రోజా, విడదల రజని, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా, ఆదిమూలపు సురేష్, నారాయణస్వామి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ముద్రగడ పద్మనాభం, సాకే శైలజానాథ్, నందిగం సురేష్ తదితరులకు ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ రాజకీయ సలహాల కమిటీకి పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సభ్యుల జాబితాలతో కూడిన ప్రకటన విడుదలైంది. దాదాపు వైసీపీలో కీలక నేతలందరికీ ఈ కమిటీలో స్థానం లభించింది. ఈ పీఏసీలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.

## చైనాకు భారీ షాక్ ఇచ్చిన ట్రంప్.. ప్రపంచ మార్కెట్లు ఢమాల్!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రతీకార సుంకాలు విధిస్తూ ప్రపంచ దేశాలను వణికిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు గట్టి షాకిచ్చారు. ఆ దేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై ఏకంగా 104 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ దెబ్బతో ప్రపంచ మార్కెట్లు మరోమారు కుదేలయ్యాయి. అమెరికా మార్కెట్లు ఇప్పటికే నష్టాలను చవిచూశాయి. నిన్న ఆసియా మార్కెట్లు కూడా నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా మార్కెట్లు తొలుత లాభాలతోనే ప్రారంభమయ్యాయి. అయితే, ట్రంప్ ప్రకటన తర్వాత ఒక్కసారిగా కుదేలయ్యాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ ప్రారంభంలో 4.1 శాతానికిపైగా లాభంతో ట్రేడ్ అయింది. చివరికి 1.6 శాతం పతనమైంది. ఫిబ్రవరిలో నమోదైన రికార్డు నుంచి ఈ సూచీ ఇప్పటి వరకు 19 శాతం దిగజారింది. మరోవైపు, డౌజోన్స్ కూడా నిన్న 0.8 శాతం, నాస్‌డాక్ 2.1 శాతం మేర కుంగిపోయాయి. ఇక, ఈ ఉదయం జపాన్ నిక్కీ 4 శాతానికి పైగా నష్టాలు చవిచూసింది. దక్షిణ కొరియా కోస్పి ఒక శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 2 శాతం మేర దిగజారాయి. అలాగే, న్యూజిలాండ్, హాంకాంగ్, చైనా సూచీలు కూడా నష్టాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి. నేడు భారత మార్కెట్లపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. చైనాపై అమెరికా విధించిన 104 శాతం టారిఫ్ నేటి నుంచి అమల్లోకి రానుంది. మిగతా దేశాలపై విధించిన అధిక టారిఫ్‌లు కూడా నేటి నుంచి పూర్తిగా అమల్లోకి రానున్నాయి.

## సోషల్ మీడియాలో అలాంటి పోస్టులు పెట్టినా నో వీసా!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి కీలక నిర్ణయాలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రధానంగా వలసల విషయంలో ఆయన ఉక్కుపాదం మోపుతున్నారు. వలసదారుల విషయంలో కఠిన నిబంధనలను అమలు చేస్తున్న యూఎస్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా వేదికగా జాతి వ్యతిరేక పోస్టులు పెట్టినట్టు తేలితే అలాంటి వారికి వీసాలు, గ్రీన్‌కార్డ్ మంజూరు చేయబోమని అమెరికా అధికారులు వెల్లడించారు. విద్యార్థి వీసాలు మొదలుకొని గ్రీన్‌కార్డ్స్ దరఖాస్తుదారుల వరకు అందరి సోషల్ మీడియా అకౌంట్లపై నిఘా ఉంచడం జరుగుతుందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ తెలిపింది. అగ్రరాజ్యానికి వచ్చి యూదు వ్యతిరేక హింస, ఉగ్రవాదాన్ని సమర్థించవచ్చని భావించే ఎవరైనా మరోసారి ఆలోచించాలని హెూంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నొయెమ్ స్పష్టం చేశారు. ఇలా తప్పుడు పోస్టులు పెట్టిన 300 మందికి గత నెలలో వీసాలు క్యాన్సిల్ చేసినట్లు విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో వెల్లడించారు. అమెరికా పౌరులు కానివారికి అమెరికన్లకు ఉన్నంత హక్కులు లేవన్నారు. వీసాల జారీ లేదా తిరస్కరణ అనేది న్యాయమూర్తుల అభీష్టానుసారం కాదని, తమ అభిష్టం మేరకు ఉంటుందని రూబియో స్పష్టం చేశారు. ఇక ఉగ్రవాద సంస్థలుగా అమెరికా వర్గీకరించిన హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్, లెబనాన్ హెజ్‌బొల్లా, యెమెన్ హూతీల వంటి గ్రూపులకు మద్దతు ఇస్తే.. వాటిని యూదు వ్యతిరేక చర్యలుగా భావిస్తామని అమెరికా తెలిపింది. అలాంటి ఉగ్రకార్యకలాపాలను ప్రచారం చేసినా... వాటి గురించి సోషల్ మీడియాలో అనుకూలంగా పోస్టులు పెట్టినా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోం



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమలులోకి వచ్చిన నేపథ్యంలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ ప్రాంతాలలో నిరసనకారులు ఆందోళనలు నిర్వహించి రోడ్లను దిగ్బంధించారు. వారిని నిలువరించేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ స్పందిస్తూ, ప్రతి జీవితం ఎంతో విలువైనదని, రాజకీయాల కోసం అల్లర్లకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అల్లర్లకు పాల్పడేవారు సమాజానికి ప్రమాదకారులని, వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం మతాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి చర్యలకు లొంగవద్దని సూచించారు. మతం అంటే మానవత్వం, నాగరికత, సామరస్యం అని ఆమె అన్నారు. శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ చట్టాన్ని తాము చేయలేదని, వ్యతిరేకిస్తున్నవారు కేంద్ర ప్రభుత్వం వద్ద సమాధానం కోరాలని ఆమె సూచించారు. వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని స్పష్టం చేశారు.

## జమిలి ఎన్నికలపై వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్య



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : జమిలి ఎన్నికల వైపు కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జమిలి ఎన్నికలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జమిలీ ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది కేవలం అపోహ మాత్రమేనని చెప్పారు. ఒకే దేశం – ఒకే ఎన్నికపై తిరుపతిలో మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రసంగిస్తూ వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. జమిలి ఎన్నికల ద్వారా ఎన్నికల ఖర్చు ఆదా అవుతుందని వెంకయ్యనాయుడు చెప్పారు. ఈ ఎన్నికలను కొన్ని పార్టీలు వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీ లేదని అన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేక పోతున్నాయని చెప్పారు. పార్టీ ఫిరాయించడం ప్రజాస్వామ్యానికి చేటు అని అన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి జంప్ కావడం సరికాదని వ్యాఖ్యానించారు.

## త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ?



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సమావేశం కానున్నారని తెలుస్తోంది. విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టాక 2024 జులైలో తొలిసారి ఇరువురూ భేటీ అయ్యారు. అప్పట్లో ప్రజాభవన్ లో జరిగిన ఈ సమావేశంలో విభజన సమస్యలపై చర్చలు జరిపారు. విడిపోయి పదేళ్లయినా చట్ట ప్రకారం జరగాల్సిన పంపకాలు పూర్తికాకపోవడంపై ఇరువురు ముఖ్యమంత్రులు దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ఇంకా పరిష్కృతం కాని సమస్యలపై తాజాగా మరోమారు భేటీ కావాలని ఏపీ సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ముఖ్యమంత్రుల భేటీకి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## గోశాలలో గోవుల మృతిపై వదంతులు.. టీటీడీ కీలక ప్రకటన

తిరుమల, నేటి పత్రిక ప్రజావార్త : టీటీడీ గోశాలలో గోవులు మృతిచెందాయని, బయటకు తెలియకుండా దాచిపెట్టారంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీటీడీ అధికారులు ఖండించారు. కొంతమంది సోషల్ మీడియాలో కావాలనే వదంతులు సృష్టిస్తున్నారని టీటీడీ ప్రకటించింది. మృతిచెందిన ఆవుల ఫొటోలు టీటీడీ గోశాలకు చెందినవి కావని స్పష్టం చేసింది. కొందరు కావాలనే వేరే ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలను టీటీడీ గోశాలకు చెందిన గోవులంటూ ప్రచారం చేస్తున్నారని టీటీడీ తెలిపింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్న ప్రచారాన్ని ఈ సందర్భంగా టీడీటీ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని కోరింది. ఈ మేరకు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలోని శ్రీవారి గోశాలలో గత 3 నెలల్లో 100కి పైగా గోవులు మృతిచెందాయని, ఈ విషయాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. అత్యంత పవిత్రంగా కొనసాగుతున్న టీటీడీ గోశాలలో ప్రస్తుతం పరిస్థితి దారుణంగా తయారయిందని మండిపడ్డారు. తమ హయాంలో దాతల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 550 గోవులను తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ ఆవులు ఇచ్చే 15 వేల లీటర్ల పాలను నిత్యం స్వామివారి అన్నప్రసాదం కోసం వినియోగించామని తెలిపారు. కానీ, ఇప్పుడు ఆ గోవులకు పుట్టిన దూడలు, ఇతర ఆవుల పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. తిరుమల పవిత్రతను కాపాడతామని, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని చెప్పిన వాళ్లంతా ఇప్పుడు ఏమయ్యారు? అని భూమన నిలదీశారు.

## వచ్చే నెలలో అయోధ్య రాముడికి పట్టాభిషేకం



అయోధ్య,నేటి పత్రిక ప్రజావార్త : అయోధ్యలో వచ్చే నెలలో శ్రీరామచంద్రుడి పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా ఆలయంలోని మొదటి అంతస్తులో రామ దర్బార్ను ఏర్పాటు చేయనున్నారు. దర్బారుకు సంబంధించిన పాలరాతి విగ్రహాలను జైపూర్లో శిల్పి ప్రశాంత్ పాండే తీర్చిదిద్దుతున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. పట్టాభిషేకానికి పరిమితంగా మాత్రమే అతిథుల్ని ఆహ్వానించనున్నట్లు సమాచారం.

## ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం ..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో మరింతగా సుపరిపాలన అందించేందుకు ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్టీజీఎస్పై సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రత్యేక సలహా మండలి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సలహా మండలిలో గేట్స్ ఫౌండేషన్ నుంచి, అలాగే మద్రాసు ఐఐటీ, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన 10 మంది నిపుణులను సభ్యులుగా నియమించాలన్నారు. ప్రజలకు మరింత మేలు చేసేలా, సుపరిపాలన అందించేందుకు ఇంకా ఏమేమి చేయొచ్చనే దానిపై ఈ సలహా మండలి అధ్యయనం చేసి సూచనలు చేసేలా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రభుత్వ సేవలు కావాలన్నా ఆన్లైన్, డిజిటల్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర సాంకేతిక మార్గాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోను ద్వారా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకుని ప్రజలు సేవలు పొందేలా అవగాహన కల్పించడంతో పాటు వాట్సప్ గవర్నెన్స్ను మరింత విస్తృత పరిచేలా చూడాలని ఆదేశించారు. జూన్ 12 కల్లా ప్రభుత్వం డిజిటల్ రూపంలో అందించగలిగే సేవలన్నిటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఆర్టీజీఎస్లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం 500 సేవలు వరకు వాట్సప్ ద్వారా అందించేందుకు వీలుందని, అయితే ప్రస్తుతం 254 సేవలు వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకువచ్చామని.. వెయ్యికి పైగా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఐటీ, ఆర్టీజీఎస్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి వివరించారు.

## సామాన్యులకు షాక్... భారీగా గ్యాస్ ధరల పెంపు!

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : వంట గ్యాస్ ధరను పంపిణీ సంస్థలు సిలిండర్కు రూ.50 పెంచాయని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి సోమవారం వెల్లడించారు. జనరల్ కేటగిరీ వినియోగదారులతో పాటు ఉజ్వల పథక లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందన్నారు. రేపటి నుంచే కొత్త ధరలు అమల్లోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ పెంపుతో 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర సాధారణ వినియోగదారులకు రూ. 803 నుంచి రూ. 853కు, ఉజ్వల్ సిలిండర్ రూ. 503 నుంచి రూ. 553కు చేరనుంది. అటు... పెట్రోల్, డీజిల్పై లీటర్కు రూ. 2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, ఆ భారాన్ని చమురు కంపెనీలే భరించనున్నాయి.

## హిందీ రాదు సార్ అన్న ఏపీ మహిళ.. తెలుగులోనే మాట్లాడాలని చెప్పిన మోదీ..




డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధానమంత్రి ముద్రా యోజన 10వ వార్షికోత్సవం సందర్భంగా రుణాలు తీసుకున్న మహిళతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర సంఘటన జరిగింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఓ మహిళ మోదీతో మాట్లాడుతూ తనకు హిందీ రాదని చెప్పారు. దీంతో పర్వాలేదు మీరు తెలుగులోనే మాట్లాడండి అంటూ మోదీ ప్రోత్సహించారు. అనంతరం ఆమె తన నేపథ్యాన్ని వివరిస్తూ.. '2019లో కెనరా బ్యాంక్ రీజినల్ సెంటర్ ఫర్ ట్రైనింగ్లో జనపనార(జూట్) బ్యాగ్ల తయారీపై 13 రోజులు శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత కెనరా బ్యాంకు వాళ్లే రూ.2 లక్షల ముద్రా రుణం ఇచ్చారు. 2019 నవంబరులో వ్యాపారం మొదలుపెట్టాను. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించడంతో 2022లో బ్యాంకు అధికారులు రూ.9.5 లక్షల రుణం ఇచ్చారు. ప్రస్తుతం నా దగ్గర 15 మంది గృహిణులు పనిచేస్తున్నారు. వారంతా గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రంలో శిక్షణ పొందిన వారే. ఒకప్పుడు అక్కడే శిక్షణ పొందిన నేను ఇప్పుడు నాలాంటి మహిళలకు బోధిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు ఎంతో రుణపడి ఉంటాను" అని ఆ మహిళ పేర్కొన్నారు. ఏపీ మహిళ ఎదుగుదలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడి డిమాండ్ చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఎంతోమంది పాలకులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. మంత్రి నారా లోకేశ్ రాకతో ఆసుపత్రి కల సాకారం కానుంది. మంగళగిరిలో ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనం శిథిలం కావడం, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో ప్రభుత్వ వైద్యశాలను చినకాకానికి మార్చి వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలాన్ని కేటాయించడం జరిగింది.

**అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మంగళగిరి..** దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు మొదటి విడతలో మూడువేల మందికి శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో రూ.వెయ్యి కోట్ల ఆస్తిపై శాశ్వత హక్కు కల్పిస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందించేందుకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. వీటితో పాటు చెరువులు, పార్కులు అభివృద్ధి చేయనున్నారు. కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించనున్నారు. ఎన్నికలకు ముందే మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 26 అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నారా లోకేశ్ ప్రజల మనస్సు గెలుచుకున్నారు.

## సింగపూర్లో అగ్నిప్రమాదం... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి గాయాలు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సింగపూర్లో జరిగిన అగ్నిప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ చిక్కుకున్నాడు. పాఠశాలలో జరిగిన ఈ ప్రమాదంలో బాబు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో స్కూల్ సిబ్బంది మార్క్ శంకర్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పవన్ను సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు సూచించారు. అయితే, అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. కురిడి గ్రామానికి వస్తానని మాటిచ్చానని, అక్కడి గిరిజనులను కలిసి ఆ తర్వాతే సింగపూర్ వెళ్తానని పవన్ కల్యాణ్ బదులిచ్చారు. ఇవాళ ప్రారంభించాల్సిన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసి వెళ్తానన్నారు. ఈ పర్యటన ముగిసిన తర్వాత జనసేనాని సింగపూర్ వెళ్లనున్నారు.

## ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉంది... అది ఎప్పుడైనా రావొచ్చు:



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ హెచ్చరించారు. మరో మహమ్మారి అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. అయితే అది ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేమని తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ పాండెమిక్ అగ్రిమెంట్పై జెనీవాలో నిర్వహించిన 13వ పునఃప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరోనా వల్ల ప్రపంచం ఎదుర్కొన్న పర్యవసనాలను గుర్తు చేశారు. పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు మరో మహమ్మారి ఆగదని, అది ఎప్పుడైనా సంభవించవచ్చని హెచ్చరించారు. అందుకు ఇరవై ఏళ్లు పట్టవచ్చు లేదా రేపే సంభవించవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ మరో మహమ్మారికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కరోనా సృష్టించిన విలయాన్ని మనమందరం చూశామని, ఈ మహమ్మారి కారణంగా అధికారికంగా 70 లక్షల మంది చనిపోయారని చెప్పినప్పటికీ, ఆ సంఖ్య 2 కోట్లు దాటి ఉంటుందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆర్థిక నష్టాన్ని చవిచూసిందని ఆయన పేర్కొన్నారు.

## వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అరెస్ట్



మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ భార్య వైఎస్ భారతిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ ను మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా విజయవాడ ఇబ్రహీంపట్నం వద్ద కిరణ్ ను అదుపులోకి తీసుకున్నారు. భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కిరణ్ పై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. దీంతో, కిరణ్ పై టీడీపీ నేతలే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కిరణ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానంటూ రామగిరి పర్యటన సందర్భంగా జగన్ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, భారతి గురించి చేబ్రోలు కిరణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆ తర్వాత క్షమాపణ చెప్పారు. తన మాటలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించమని కోరుతున్నానని అన్నారు. ఎలాంటి దురుద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయలేదని... క్షణికావేశంలో మాత్రమే చేశానని చెప్పారు.

## జిల్లా ఎస్పీ మహిళ అనే విచక్షణ కూడా లేకుండా జగన్ మాట్లాడారు: పురందేశ్వరి



రాప్తాడు, నేటి పత్రిక ప్రజావార్త : రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి పర్యటనలో పోలీసులపై వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులను గుడ్డలు ఊడదీయిస్తానని జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ వ్యాఖ్యలను ఏపీ పోలీసుల అధికారుల సంఘం కూడా తప్పుబట్టింది. జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మరోవైపు జగన్ వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి విమర్శలు గుప్పించారు. నాలుగో సింహంగా పరిగణించే పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని చెప్పారు. పోలీసులపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆమె అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మహిళ అనే విచక్షణ కూడా లేకుండా జగన్ మాట్లాడారని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థలో దాదాపు 5 వేల మంది మహిళలు ఉన్నారనే విషయాన్ని జగన్ గుర్తించాలని చెప్పారు. పోలీసులందరినీ కించపరిచేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. పోలీసు వ్యవస్థకి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## 2028 ఒలింపిక్స్లో టీ20 ఫార్మాట్ క్రికెట్



స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్ క్రీడలలో టీ20 ఫార్మాట్ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. మెన్స్, ఉమెన్స్ విభాగాల్లో ఆరు జట్ల చొప్పున పాల్గొంటాయి. ఒక్కో జట్టు నుంచి 15 మంది చొప్పున 90 మంది క్రికెటర్లకు అనుమతిస్తూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బుధవారం ధృవీకరించింది. ఈ మేరకు 2028 ఒలింపిక్ క్రీడల కోసం ఈవెంట్ ప్రోగ్రామ్, అథ్లెట్ కోటాలను ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు నిన్న ఆమోదించింది. ఇందులో భాగంగానే టీ20 ఫార్మాట్లో క్రికెట్ను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, క్రికెట్ మ్యాచ్ వేదికలు, షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. రాబోయే ఒలింపిక్స్లో మొత్తం ఐదు కొత్త క్రీడలకు ఐఓసీ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. వాటిలో క్రికెట్ ఒకటి. బేస్బాల్/సాఫ్ట్బాల్, ఫ్లాగ్ ఫుట్బాల్, లాక్రోస్ (సిక్సర్లు), స్క్వాష్లతో పాటు క్రికెట్ను చేర్చడానికి ఒలింపిక్ కమిటీ రెండేళ్ల క్రితం ఆమోదం తెలిపింది.

కాగా, ఒక శతాబ్దానికి పైగా ఒలింపిక్స్లో క్రికెట్ కనిపించలేదు. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్ క్రీడలలో గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మధ్య ఒకే ఒక్క రెండు రోజుల క్రికెట్ మ్యాచ్ జరిగింది. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్ను చేర్చడం వలన ఈ క్రీడ ఇతర అంతర్జాతీయ ఈవెంట్లలో కనిపించే అవకాశం కూడా పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. 1998లో కౌలాలంపూర్లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో మెన్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, ఉమెన్స్ క్రికెట్ 2022లో బర్మింగ్హామ్లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో అరంగేట్రం చేసింది.

## 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి రూ. 2,243 కోట్ల విరాళాలు

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రూ. 2,243 కోట్ల విరాళాలు స్వీకరించింది. అసోసియేటెడ్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) జాతీయ పార్టీలు ఆ ఆర్థిక సంవత్సరంలో పొందిన విరాళాల వివరాలను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. అన్ని జాతీయ పార్టీలకు కలిపి మొత్తం రూ. 2,544.28 కోట్ల విరాళాలు అందాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 12,547 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన విరాళాలలో బీజేపీ వాటా 88 శాతంగా ఉంది. రూ. 281 కోట్ల విరాళాలతో కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీలు ఉన్నాయి. తమకు ఎలాంటి విరాళాలు అందలేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రకటించింది.

## అమరావతిలో చంద్రబాబు సొంత ఇంటి నిర్మాణం




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి సంకల్పించారు. ఇవాళ భూమి పూజ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియోను నారా లోకేశ్ తన యూట్యూబ్ చానల్ లో అప్ లోడ్ చేశారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలోని వెలగపూడిలో సొంతంగా 5 ఎకరాల స్థలం కొనుక్కున్నారు. సచివాలయం వెనుక ఉన్న ఈ-9 రహదారికి పక్కనే ఈ స్థలం ఉంది. ఓ రైతు నుంచి ఈ స్థలం కొనుగోలు చేశారు.

## తనకేమీ గుర్తులేదన్న డాక్టర్ ప్రభావతి వ్యాఖ్యలపై రఘురామకృష్ణరాజు స్పందన



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కస్టోడియల్ టార్చర్ కేసులో తనకేమీ గుర్తులేదని వైద్యురాలు ప్రభావతి పోలీసు విచారణలో చెప్పడంపై ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైద్యులు ఇచ్చిన నివేదికపై సంతకం చేశానని, గాయాల గురించి తనకు అవగాహన లేదని డాక్టర్ ప్రభావతి చెప్పడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. ఎంబీబీఎస్ చేసిన ఎవరికైనా కనీస అవగాహన ఉంటుందన్న విషయం ఆమె ఎలా మరిచిపోయారో తెలియదన్నారు. ఆమెకు గతం గుర్తుకు వచ్చే ఏర్పాట్లు జరుగుతాయని తాను భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. కోర్టులు మన చేతుల్లో ఉండవు కాబట్టి, ఏ తీర్పు వచ్చినా శిరసావహించాలని తెలిపారు. డాక్టర్ ప్రభావతి గారికి మళ్లీ జ్ఞాపకశక్తి రావాలని కోరుకుంటున్నానని చెప్పారు. కొన్ని సినిమాల్లో గతం మర్చిపోయిన వాళ్లకు ఏదైనా దెబ్బ తగిలిన వెంటనే గతం గుర్తుకు వస్తుందని రఘురామ పేర్కొన్నారు. నిజజీవితంలో ప్రభావతి గారికి ఆ సీన్ రిపీట్ అవ్వాలని, ఆమె మామూలు మనిషి అవ్వాలని, ఎంబీబీఎస్ లో చదివిందంతా మళ్లీ గుర్తుకు రావాలని భగవంతుడ్ని ప్రార్థించడం తప్ప మనం చేయగలిగేది ఏమీ లేదని వ్యాఖ్యానించారు. ఈ నెల 15వ తారీఖు వరకు చూద్దాం... ఏం జరుగుతుందో అని అన్నారు.

## జే బ్రాండ్లతో లివర్, కిడ్నీ సమస్యలతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు: కొల్లు రవీంద్ర



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎక్సైజ్ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్... లిక్కర్ వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారని చెప్పారు. కొత్త ఎక్సైజ్ పాలసీ పేరుతో వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని దుయ్యబట్టారు. తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిస్టిలరీల దగ్గర నుంచి మద్యం షాపుల వరకు మొత్తం హస్తగతం చేసుకున్నారని రవీంద్ర మండిపడ్డారు. జే బ్రాండ్ మద్యంతో లివర్, కిడ్నీ సమస్యలతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీకి శ్రీకారం చుట్టిందని చెప్పారు. డ్రా నిర్వహించి అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాలను కేటాయించామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ఈగిల్ టీమ్ లను ఏర్పాటు చేశామని చెప్పారు.

## దినదిన గండం.. అమెరికాలో మన విద్యార్థుల పరిస్థితి



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులు ప్రస్తుతం అక్కడ ఆందోళనతో గడుపుతున్నారు. ఏ చిన్న పొరపాటు చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని టెన్షన్ పడుతున్నట్లు వెల్లడించారు. కారును ఓవర్ స్పీడ్ తో నడిపినా కూడా అధికారులు వీసా రద్దు చేస్తున్నారని, దగ్గరుండి విమానం ఎక్కించి భారత్ కు తిప్పి పంపుతున్నారని చెప్పారు. సోషల్ మీడియా పోస్టులను నిశితంగా పరిశీలిస్తున్నారని, ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థం కావడంలేదని చెబుతున్నారు. యూనివర్సిటీ క్యాంపస్ లలో జరుగుతున్న ఆందోళనలతో సంబంధం లేకున్నా గతంలో ట్రాఫిక్ ఉల్లంఘనలను కారణంగా చూపి భారత్ కు చెందిన ఓ విద్యార్థి వీసాను అధికారులు రద్దుచేశారని వార్తలు వెలువడుతున్నాయి. విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయని, ఇందులో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారని అమెరికా కళాశాలలు పేర్కొంటున్నాయి.

## యథావిధిగా ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సేవలు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కింద వైద్య సేవలు నేటి నుంచి యథావిధిగా కొనసాగనున్నాయి. సోమవారం నుంచి రాష్ట్రంలో వైద్య సేవలు నిలుపుదల చేస్తున్నట్లు ఆశా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం (ఆశా)తో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో తక్షణమే రూ.500 కోట్ల బకాయిలు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో తమకు రావాల్సిన రూ.3,500 కోట్ల బకాయిలు, తమ ఇబ్బందులను స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం నేతలు చంద్రబాబుకు వివరించారు. అయితే త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కారం కనుగొందామని సీఎం వారికి సూచించారు. అనంతరం వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుతో ఆశా నేతలు చర్చలు జరిపారు. మంగళవారం నిధులు విడుదల చేస్తామని అధికారులు తెలియజేశారు. అనంతరం వైద్యసేవలు పునరుద్ధరించాలని ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆశా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం విడుదలైన నిధులు మొత్తం బకాయిలకు సరిపడకపోయినప్పటికీ సీఎం హామీని గౌరవిస్తూ, రాష్ట్ర ఆర్థిక స్థితిని పరిగణలోకి తీసుకుని ఏఎస్హెచ్ఏ కార్యవర్గం మంగళవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద నగదు రహిత (క్యాష్ లెస్) సేవలు మళ్లీ ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని ఆసుపత్రులు ఈ సేవలను మళ్లీ ప్రారంభించి, ప్రజలకు వైద్య సేవలలో అంతరాయం కలగకుండా చూడాలని ఆశా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## సెంట్రల్ జీఎస్టీ ద్వారా ఏపీకి పెరిగిన ఆదాయం ఎంతంటే..?

గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్కు సెంట్రల్ జీఎస్టీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరిగింది. ఈ విషయాన్ని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి. ఆనంద్ కుమార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఒక శాతం అధికమని ఆయన పేర్కొన్నారు. విశాఖ జీఎస్టీ భవన్లో ఆయన మీడియా సమావేశంలో పలు అంశాలు వివరించారు. అనంతపురం జిల్లాలో కియా సంస్థ ఉండటం వల్ల అక్కడ పన్ను వసూలు ఎక్కువగా ఉంటుందని చెప్పిన ఆయన, విశాఖలో తగ్గడానికి స్టీల్ ప్లాంట్ ఇబ్బందుల్లో ఉండటం ఒక కారణంగా పేర్కొన్నారు. 2024-25లో రూ.1,510 కోట్ల మేర సెంట్రల్ జీఎస్టీని ఎగవేసినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. 2023-24లో రూ.2,682 కోట్ల పన్నును ఎగవేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో సీజీఎస్టీ చెల్లించేవారు 1.81 లక్షల మంది, రాష్ట్ర జీఎస్టీ కట్టేవారు 2 లక్షల మందికి పైగా ఉన్నారని ఆయన వివరించారు. నకిలీ ఇన్వాయిస్లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

## ప్రజలు ఓడించినప్పటికీ జగన్కు బుద్ధి రాలేదు: సీపీఐ నారాయణ

మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రజలు ఓడించినా జగన్మోహన్ రెడ్డికి బుద్ధి రాలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చిన కాకానిలో ఆదివారం ఆయన పర్యటించారు. సీపీఐ జనసేవాదళ్ శిక్షణా తరగతుల శిబిరాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఆర్థిక విధ్వంసం, వికృత చర్యలకు పాల్పడటంతో రాష్ట్రంలో లక్షలాదిగా నిర్మించిన గృహాలు నిరుపయోగంగా మారి వ్యాపారులు, వినియోగదారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. విజయవాడ కనకదుర్గ వారధి నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వరకు నిర్మించిన బహుళ అంతస్తులు నిరుపయోగంగా మారాయని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారన్నారు. జగన్ విధ్వంసకర ఆర్థిక విధానాలతోనే చంద్రబాబును ప్రజలు గెలిపించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి దృక్పథం ఉన్న నాయకుడని, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడే వ్యక్తి అని ఆయన కొనియాడారు. కానీ పీ4 పథకం కార్పొరేట్లకు మేలు చేస్తుందే కానీ పేదలకు ఎలాంటి ఉపయోగకరం కాదని తెలిపారు. రాష్ట్రాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసే దిశగా ఉన్న పీ4 పాలసీని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

## బకాయిల చెల్లింపులపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఉద్యోగులకు బకాయి పడిన రూ.25వేల కోట్ల చెల్లింపులకు సంబంధించి రాబోయే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాధరపురంలోని కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సూర్యనారాయణ మాట్లాడుతూ, గత ఐదేళ్ళుగా ప్రభుత్వం దాదాపు రూ.25వేల కోట్ల బకాయలు పడిందని ఈ చెల్లింపులకు బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం బాధాకరమన్నారు. రాబోయే మంత్రి వర్గ సమావేశంలో పెండింగ్ బకాయిలు చెల్లింపులపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

2023 జూలై నుండి అమలు కావాల్సిన 12వ వేతన సవరణ సంఘానికి ఇప్పటికీ ప్రభుత్వం ఎలాంటి కమిషన్ ఏర్పాటు చేయలేదని వెంటనే హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో త్రిసభ్య కమిటీతో కూడిన వేతన సవరణ కమిషన్ను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పలు డిమాండ్లపై ఐక్యవేదిక తీర్మానం చేసింది. అందులో భాగంగా ఉద్యోగులకు బకాయిలు, సర్వీస్ సమస్యల పరిష్కారంపై జూన్లో ఐక్యవేదిక తరపున పదివేల మందికి పైగా ఉద్యోగులతో విజయవాడలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఉద్యోగి సర్వీస్ రిజిష్టర్లో 2025 మార్చి 31 నాటికి గల బకాయిల వివరాలును నమోదు చేయాలని గతంలో రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ను పునరుద్ధరించాలని, ఆర్థికపరమైన చెల్లింపులకు చట్టబద్ధ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, నిర్ణీత కాల పరిమితితో ఉద్యోగ సంఘా లకు ఎన్నికలు



నిర్వహించాలని పలు తీర్మానాలు చేశారు. అదేవిధంగా మే 1నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల సంఘం చేపట్టిన చైతన్య యాత్రకు ఐక్యవేదిక పూర్తి మద్దతు ఇస్తుందని, సెప్టెంబర్ 1న జరిగే ర్యాలీలో ఐక్యవేదిక సభ్యులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ చట్టం కొనసాగింపుపై కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. అలాగే సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో ఐక్యవేదిక కో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్ర టరీ జనరల్ బాజీ పఠాన్, పెన్షన సంఘాల అధ్యక్షుడు రామచంద్రరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్కుమార్, వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు, ఐక్యవేదిక వైస్ చైర్మన్ కేదారేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ రవీంద్రబాబు, సెక్రటరీ జనరల్ నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు, ఐక్యవేదిక సభ్య సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ వార్తలు

## రాష్ట్రంలో కొందరు ఐ.ఏ.ఎస్.లు సహచర ఉద్యోగులను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారు...

*-అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో కొందరు ఐ.ఏ.ఎస్.లు సహచర ఉద్యోగులను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఈ విధానాలను మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ హెచ్చరించారు. శనివారం విద్యాధరపురంలోని రాష్ట్ర సంఘ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ 95% మార్గదర్శకులుగా నిలుస్తున్నారని 10 శాతం మాత్రమే ఉద్యోగుల్లో ఘర్షణ వాతావరణం నెలకొల్పుతున్నారని వెల్లడించారు. ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో జూన్ నెలలో పెద్ద ఎత్తున కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని చెప్పారు. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వంలో ఉద్యోగస్తుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగస్తుల సానుకూలంగా ఉందని అయినా ఆర్థిక లోటు ఉండటంవల్ల ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేకపోతున్నామన్నారు. వేతన సవరణ విషయంలో సెటిల్మెంట్ న్యాయమూర్తులు ముగ్గురితో కమిషన్ వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. గతంలో ఉద్యోగస్తుల సర్వీస్ వ్యవహారాల కోసం ఏర్పాటుచేసిన వ్యవస్థ నేడు నిర్వీర్యం అయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్మినిస్ట్రేటివ్ వ్యవస్థలో మార్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 95 శాతం ఐఏఎస్లు మార్గదర్శకులుగా ఉన్నారని, పది శాతం ఐఏఎస్లు అన్ని నిబంధనలకు అతీతంగా వ్యవహరిస్తూ ఉద్యోగస్తుల్లో ఘర్షణ వాతావరణం నెల కొల్పుతున్నారన్నారు. ఈ విధానం శృతిమించితే పోరాటాలకు దారి తీసే అవకాశాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇవ్వకపోయినా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని ఈ అంశం మీద ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. అధిక సంఖ్యాబలం కలిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో జూన్ లో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నామనిఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కుమార్ తో పాటు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వాటిని చూసినప్పుడు చంద్రబాబునాయుడు గుర్తుకు వస్తారు: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : ఐటీ కంపెనీలు, హైటెక్ సిటీని చూసినప్పుడు నారా చంద్రబాబునాయుడు గుర్తుకు వస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొట్టమొదటిసారి రూ. 2కే ఎన్టీఆర్ బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని, దానిని తీసుకున్న ప్రతి పేదవాడు ఆయనను గుర్తు చేసుకుంటారని అన్నారు. జలయజ్ఞం, రైతుబాంధవుడుగా వైఎస్సార్ ప్రజల మదిలో నిలిచిపోతారని అన్నారు. తన బ్రాండ్ యంగ్ ఇండియా అని ఆయన స్పష్టం చేశారు. విశ్లేషకులు, విమర్శకులు, ప్రజలకు తాను ఒక్కటే చెప్పదలుచుకున్నానని, యంగ్ ఇండియానే తన బ్రాండ్ అని ఆయన అన్నారు. ఎలాంటి బ్రాండ్ లేకుండా, గుర్తింపు లేని ముఖ్యమంత్రిగా ఉంటారా అని కొందరు తనను ప్రశ్నిస్తున్నారని, దానికి సమాధానంగా యంగ్ ఇండియా తన బ్రాండ్ అని చెబుతున్నానని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఆయన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పోలీసు శాఖపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. కేజీ టు పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిధుల విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

> **కెరటం నా ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు....**
> - స్వామి వివేకానంద

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి!



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : సైనిక పాఠశాలల తరహాలో పోలీసుల పిల్లలకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో తొలి స్కూల్ ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఉదయం ప్రారంభించారు. విద్యాసంస్థ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ ఉన్నతాధి కారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి స్కూల్ లో ఏర్పాట్లను పరిశీలించారు.

**50శాతం సీట్లు పోలీసు పిల్లలకే.** ఈ స్కూల్ లో అమరులైన పోలీసుల పిల్లలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తరువాత సర్వీసులో ఉన్న కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ ల కుటుంబాల పిల్లలకు 50శాతం సీట్లు కేటాయించారు. మరో 50శాతం సీట్లు స్థానికులకు కేటాయించారు. ఓపెన్ కేటగిరీ విధానంలో సీట్లు అందుబాటులో ఉంటాయి. 1 నుంచి 5 తరగతుల్లో అడ్మిషన్ల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) వెబ్సైట్లో అప్లయ్ చేసుకోవచ్చు. ప్రతి క్లాసులో 40 సీట్లు ఉంటాయి. 5 తరగతుల్లో కలిపి మొత్తం 200 సీట్లు ఉంటాయి.

## జగన్ పై అనిత ఫైర్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ రాప్తాడు పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. టీడీపీపై, పోలీసులపై జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత స్పందిస్తూ... నిన్నటి జగన్ పర్యటన డ్రామాను తలపించిందని అన్నారు. జగన్ పర్యటన సందర్భంగా 1,100 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశామని... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు కూడా ఇంతటి భద్రతను కల్పించలేదని చెప్పారు. జగన్ వెళుతున్న ప్రాంతం చాలా సెన్సిటివ్ అని... అందుకే భారీ భద్రతను కల్పించామని అన్నారు. కానీ, కావాలనే సీన్ క్రియేట్ చేశారని మండిపడ్డారు. హెలిపాడ్ వద్దకు వైసీపీ కార్యకర్తలు తోసుకుంటూ వచ్చారని... ఈ క్రమంలో కొంతమంది పోలీసులకు గాయాలయ్యాయని అనిత చెప్పారు. హెలికాప్టర్ దెబ్బతిన్నదని చెబుతూ జగన్ రోడ్డు మార్గంలో వెళ్లిపోయారని... కాసేపటికే హెలికాప్టర్ వెళ్లిపోయిందని తెలిపారు. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం చేశారని విమర్శించారు. ఇలా కూడా ఆలోచిస్తారా? అని అనిపించిందని చెప్పారు. వైసీపీ హయాంలో 2,800కి పైగా టీడీపీ నేతలు, కార్యకర్తల హత్యలు జరిగాయని అనిత తెలిపారు. ఇప్పటి సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ సహా నాపైనా కేసులు పెట్టారని దుయ్యబట్టారు. రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది ఇలాంటి సంస్కృతి కాదని చెప్పారు. పోలీసు అధికారుల బట్టలు ఊడదీస్తానని మాజీ సీఎం అనొచ్చా? అని అనిత ప్రశ్నించారు. ఇలాంటి ప్రవర్తన వల్లే 151 నుంచి 11కి దిగిపోయావని ఎద్దేవా చేశారు. నువ్వు మారకపోతే వచ్చే ఎన్నికల్లో 11 కూడా రావని అన్నారు. జగన్ వెళ్లిన వెంటనే హెలికాప్టర్ వెళ్లిపోవడంపై దర్యాప్తు చేస్తామని చెప్పారు. వైసీపీ వాళ్లు పద్ధతి మార్చుకోకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. ఎస్సై సుధాకర్ కు నిజంగా దమ్ముందని అన్నారు. పోలీసులపై చేసిన వ్యాఖ్యలకు జగన్ సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.

## తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలైకి జాతీయ స్థాయిలో పదవి...!



తమిళనాడు, నేటి పత్రిక ప్రజావార్త : తమిళనాడు బీజేపీ రాజకీయాల్లో శుక్రవారం రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకటి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి మార్పు, మరొకటి అన్నా డీఎంకేతో పొత్తు. బీజేపీ అగ్రనాయకుడు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం అన్నా డీఎంకేతో పొత్తుకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. పళనిస్వామి నేతృత్వంలో రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. మరో పక్క తమిళనాడు బీజేపీ చీఫ్గా ఉన్న అన్నామలై స్థానంలో కొత్త అధ్యక్షుడుగా, తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ ఎన్నిక కానున్నారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న నాగేంద్రన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక లాంఛనప్రాయం అయింది. అయితే తమిళనాడులో బీజేపీకి ఓట్ల శాతం పెరగడానికి అన్నామలై కారణమనే మాట వినిపిస్తోంది. 2021 జూన్లో తమిళనాడు బీజేపీ పగ్గాలు చేపట్టిన అన్నామలై డీఎంకేను ధీటుగా ఎదుర్కొన్న నేతగా పేరు సంపాదించారు. ఎన్ మన్ ఎన్ మక్కల్ పాదయాత్ర ద్వారా బీజేపీని తమిళనాడులో ప్రతి గ్రామానికీ తీసుకువెళ్లారు. దీని ఫలితంగా బీజేపీకి ఓటు శాతం పెరిగింది. 2024 ఎన్నికల్లో ఒక్క స్థానం రాకపోయినప్పటికీ ప్రజల ఆదరణ అయితే కనిపించింది. దీంతో రాబోయే ఎన్నికలకు బీజేపీతో పొత్తుకు అన్నా డీఎంకే ముందుకు వచ్చిందని అంటున్నారు. కొద్ది రోజుల క్రితం పళనిస్వామి ఢిల్లీలో అమిత్ షాతో సమావేశం అయినప్పుడే పొత్తు దాదాపు ఖాయమైనట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా శుక్రవారం చెన్నైలో అమిత్ షా పొత్తుపై అధికారిక ప్రకటన చేశారు. ఇదే క్రమంలో రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన అన్నామలైని అమిత్ షా ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ప్రజలకు చేరవేయడంలో, పార్టీ కార్యక్రమాలను గ్రామ గ్రామానికీ తీసుకువెళ్లడంలో అన్నామలై కృషి అపూర్వమైనదని కొనియాడారు. అన్నామలై సంస్థాగత నైపుణ్యాలను పార్టీ జాతీయ స్థాయిలో వినియోగించుకుంటుందని పేర్కొన్నారు. దీంతో అన్నామలైకి జాతీయ స్థాయిలో పదవి లభించనుందని భావిస్తున్నారు. అమిత్ షా ట్వీట్లో పరోక్షంగా వెల్లడించినట్లుగా ఉందని అంటున్నారు.

## మహిళలపై వ్యాఖ్యలు.. తమిళనాడు మంత్రిపై ఖుష్బూ, కనిమొళి, గాయని చిన్మయి ఆగ్రహం

తమిళనాడు, నేటి పత్రిక ప్రజావార్త : మహిళలను కించపరిచే విధంగా మాట్లాడారంటూ తమిళనాడు మంత్రి కె. పొన్ముడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. అందులో ఆయన సెక్స్ వర్కర్లు, కస్టమర్ల మధ్య సంభాషణ ఇలా ఉంటుందంటూ అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించారు. ఇదంతా జోక్ అని చివరలో చెప్పారు. అయితే ఆయన మాట్లాడిన తీరు మహిళలను కించపరిచేలా ఉందని విమర్శలు వస్తున్నాయి. ప్రముఖ గాయని చిన్మయి, నటి ఖుష్బూతో పాటు పలువురు ప్రముఖులు మంత్రి తీరును ఖండించారు. సొంత పార్టీ నేతలు కూడా మంత్రి వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో డీఎంకే చర్యలకు సిద్ధమైంది. మీ మంత్రి చేసిన వ్యాఖ్యలకు అర్థమేంటో నా కంటే మీకే బాగా తెలుసని స్టాలిన్ను ఉద్దేశించి ఖుష్బూ అన్నారు. ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను మీ ఇంట్లోని మహిళలు అంగీకరిస్తారా అని ప్రశ్నించారు. ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిని ఆ భగవంతుడే శిక్షిస్తాడని గాయని చిన్మయి పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలను సొంత పార్టీ ఎంపీ కనిమొళి కూడా ఖండించారు. పొన్ముడి చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సరికాదన్నారు. కారణమేదైనా మహిళలపై మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించాలని అన్నారు. ఆ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో పొన్ముడిని డీఎంకే పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి తప్పించింది. గతంలోనూ ఆయన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఉచిత బస్సు సౌకర్యం గురించి మాట్లాడుతూ మహిళలను వలసదారులతో పోల్చారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

## గూగుల్లో మళ్లీ లేఆఫ్లు.. వందలాది మందిపై వేటు..!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : టెక్ దిగ్గజం 'గూగుల్' లో మరోసారి లేఆఫ్స్ చేపట్టింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్వేర్, పిక్సెల్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ విభాగాల్లో పని చేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు లేఆఫ్లు ఇచ్చినట్లు సమాచారం. సంస్థకు చెందిన విశ్వసనీయ వర్గాల ద్వారా లేఆఫ్స్ విషయం వెలుగులోకి వచ్చినట్లు 'ది ఇన్ఫర్మేషన్' అనే మీడియా సంస్థ కథనం పేర్కొంది. అయితే, ఎంతమందిపై లేఆఫ్స్ ప్రభావం పడిందన్నది కచ్చితంగా తెలియరాలేదు. కాగా, గూగుల్ గతేడాది డిసెంబర్లో కూడా 10 శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లేఆఫ్స్ పొందిన వారిలో డైరెక్టర్లు, మేనేజర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారు ఉండటం గమనార్హం. అంతకుముందు 2023 జనవరిలో 12 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా క్లౌడ్ ఆర్గనైజేషన్, హెచ్ఆర్ విభాగంలో కొంతమందిని తొలగించిన విషయం తెలిసిందే. వ్యయం తగ్గింపులో భాగంగా టెక్ దిగ్గజం ఈ నిర్ణయం తీసుకుంది.

## మణిపాల్లో సౌత్ ఏషియన్ లివర్ ప్రోగ్రామ్ కాలేయ మార్పిడి

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఏషియన్ లివర్ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో, కాలేయ మార్పిడిలో ఈఆర్ఎఎస్కి కేంద్రంగా మారింది. కాలేయ మార్పిడి తర్వాత రికార్డు స్థాయిలో కేవలం 5 రోజుల్లోనే డిస్చార్జ్ చెయ్యడం అనేది దేశంలోనే 'మొదటి సారి'. శస్త్రచికిత్స తర్వాత మెరుగైన రికవరీ అనే ఒక విప్లవం ప్రారంభమ య్యింది. ఇది పురాతన శస్త్రచికిత్సా మూస పద్ధతులకు స్వస్తి పలికింది. విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్లో లివర్ ట్రాన్స్ ప్లాంట్ ప్రోగ్రామ్ హెడ్, ప్రఖ్యాత లివర్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ వివరించారు.


మణిపాల్-సౌత్ ఏషియన్ లివర్ ప్రోగ్రామ్లో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్న 60 మంది రోగులలో, దాదాపు 13 మంది రోగులు ఈ కొత్త ఈఆర్ఎఎస్ కార్యక్రమం నుండి విజయవంతంగా ప్రయోజనం పొందా రన్నారు. ఆసుపత్రిలో ఉండే సమయంలో ఈ 20-30% తగ్గింపు అనేది ఒక భారీ మార్పు, ఇది ప్రస్తుతం అధిక స్థాయిలో ఉన్న లివర్ ట్రాన్స్ ప్లాంటే షన్ ఖర్చును మరింత తగ్గించడంలో సహాయపడుతుంది అని ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ పేర్కొన్నారు. విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్- సౌత్ ఏషియన్ లివర్ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో గత 3 సంవత్సరాలుగా కోస్టల్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవలందిస్తోంది మరియు ఈ తక్కువ వ్యవధిలోనే, మణిపాల్ హాస్పిటల్ కాలేయ వ్యాధికి అత్యుత్తమ కేంద్రంగా స్థిరపడిరది. గత సంవత్సరం రాష్ట్రంలో మేము అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడిని నిర్వహించాము, అంతే కాదు



పిల్లలలో అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడిని నిర్వహించాము. వాస్తవానికి, కొన్ని నెలల క్రితం పనిచేయని కాలేయ క్యాన్సర్తో బాధపడుతున్న 4 సంవత్సరాల బాలుడికి జీవించి ఉన్న దాత కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన మొదటి సంస్థ మాది అని అన్నారు.

ఈ రోగులు సాధారణ జీవితంలోకి తిరిగి వస్తున్నందున, విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ బృందం వారి ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడంలో అంకితభావంతో ఉంది. ఈఆర్ఎఎస్ విజయవంతంగా ప్రారంభం కావడం పిల్లల మరియు కాలేయ మార్పిడి వైద్యంలో ఆసుపత్రి నాయకత్వాన్ని నొక్కి చెబుతుంది, అవసరంలో ఉన్న అనేక కుటుంబాలకు ఆశను అందిస్తోంది. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యావత్ తెలంగాణ ఇప్పుడు కేసీఆర్ వైపు చూస్తోంది: హరీశ్ రావు



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ఈ నెల 27న వరంగల్ లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యావత్ తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు కేసీఆర్ వైపు చూస్తోందని అన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏవి పాలో, ఏవి నీళ్లో ప్రజలకు తెలిసిందని స్పష్టం చేశారు. ఆనాడు ఎల్ఆర్ఎస్ ఉచితం అని చెప్పారు... ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారు అని హరీశ్ రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పనితీరు గురించి చెప్పాలంటే మాటలకు ఎక్కువ, చేతలకు తక్కువ అని విమర్శించారు. రైతు బంధు, రుణమాఫీపై ముఖ్యమంత్రి చెప్పేవన్నీ అబద్ధాలేనని ధ్వజమెత్తారు. కేసీఆర్ తెలంగాణను నిలబడితే, రేవంత్ రెడ్డి పడగొట్టారని హరీశ్ రావు పేర్కొన్నారు. జీఎస్టీ వాటా తగ్గిందంటే అందుకు కారణం రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయింది... రేవంత్ రెడ్డి పాలన అంతా సగం సగం... ఆగం ఆగం అని విమర్శించారు.

## రాజకీయాల్లోకి రావడంపై స్పందించిన రేణు దేశాయ్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : రాజకీయాల్లో తాను సరిపోనని భావిస్తున్నానని నటి రేణు దేశాయ్ అన్నారు. ఒక పాడ్కాస్ట్లో రాజకీయ ప్రవేశం గురించి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ, గతంలో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం వచ్చినా పిల్లల కోసం వదులుకున్నానని తెలిపారు. రాజకీయాలు తన జీవితంలో భాగమని భావించానని, కానీ ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని ఆమె అన్నారు. తాను విధిరాతను ఎదిరించి ముందుకు సాగుతున్నానని చెప్పారు. ప్రజలకు సేవ చేయడంలో తనకు సంతోషం కలుగుతుందని, ఏ ఒక్క చిన్నారి కూడా ఆకలితో ఉండకూడదని తాను కోరుకుంటానని అన్నారు. మన దేశంలో డబ్బుకు, ఆహారానికి కొదవ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. తనకు ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే అలవాటు ఉందని, ఒకవేళ తాను ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే తప్పకుండా ప్రకటిస్తానని, దానిని రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని రేణూ స్పష్టం చేశారు. అకీరాను రామ్ చరణ్ సినీ పరిశ్రమకు పరిచయం చేస్తున్నారనే వార్తలపై రేణు దేశాయ్ స్పందించారు. ఆ ప్రచారంలో నిజం లేదని ఆమె కొట్టిపారేశారు. అకీరా ప్రస్తుతం 'ఓజీ' సినిమాకు పనిచేయడం లేదని కూడా స్పష్టం చేశారు. అకీరా నటన గురించి ఆలోచించిన రోజున తప్పకుండా ఇన్స్టాగ్రామ్లో ఒక పోస్టు పెడతానని ఆమె తెలిపారు.

## బిజెపి పాలన సుభిక్షంగా కొనసాగాలి...: తాతా సుబ్రహ్మణ్యం




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : బిజెపి ప్రభుత్వ పాలన 11సంవత్స రాలు పూర్తయిన సందర్భంగా ఏకాదశ వసంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిజెపి నేతృతంలో దేశం అన్నిరంగాల్లో ఉన్నతమైన స్థానం లోకి వెళుతుందని, బిజెపి పాలన సుభిక్షంగా కొనసాగాలని కోరుతూ రాజ కీయ విశ్లేషకులు తాతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్ లోని స్థానిక ప్రెస్క్లబ్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 మంది వేద బ్రాహ్మణులచే వేద పఠనం, ఆశీర్వచనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోడీ దీర్ఘాయుష్షు కలిగి ఉండాలని, దేశాన్ని ముందుకు నడిపించాలని ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా తాతా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మోడీ నేతృత్వంలో దేశంలో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. బిజెపి పార్టీ స్థాపించి 45 సంవత్స రాలు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని కోట్లాదిమంది కార్యకర్తలని సొంతం చేసుకుంద న్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని, ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిం చడమే పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్లో బీజేపీ, తెలుగు దేశం, జనసేన కలిసి కూటమి ప్రభుత్వంగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్లో సూపరి పాలన అందిస్తున్నారన్నారు. మోడీ నాయకత్వంలో బీజేపీ11వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా11మంది వేద పండితులతో ఘనంగా పూజలు నిర్వహించామన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు సాగాలని గొప్ప గొప్ప పరిశ్రమలు రాష్ట్రానికి రావాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగావ కాశాలు లభించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పోల వరం, విశాఖ ఉక్కు, రైల్వే జోన్లకు ఎటువంటి అరిష్టాలు కలగకుండా సకా లంలో ఆర్థిక వనరులు సమకూరాలని కోరుకున్నారు.

## శంషాబాద్ విమానాశ్రయం సరికొత్త రికార్డు

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రయాణికుల రాకపోకల్లో గణనీయమైన వృద్ధి సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 15.20 శాతం వృద్ధి సాధించి దేశంలోని ప్రముఖ విమానాశ్రయాలను అధిగమించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో శంషాబాద్లోని రాజీవ్గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఏకంగా 2.13 కోట్ల మంది ప్రయాణించారు. ఈ రద్దీ ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది ప్రయాణికుల సంఖ్య మూడు కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లోనూ ఈ ఎయిర్పోర్టు మరో రికార్డు నెలకొల్పింది. ఇక్కడి నుంచి ఒక నెలలో ప్రయాణించే వారి సంఖ్య గరిష్ఠంగా 20 లక్షలే కాగా, ఈసారి మాత్రం ఈ మూడు నెలల్లో ఏకంగా 74 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో చెన్నై, కోల్కతాలను అధిగమించింది. అలాగే, హైదరాబాద్ నుంచి దుబాయ్కి నెలకు 93 వేలమంది, దోహాకు 42 వేల మంది, అబుధాబికి 38 వేల మంది, జెడ్డాకు 31 వేల మంది, సింగపూర్కు 31 వేల మంది రాకపోకలు సాగిస్తున్నట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త...



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు శుభవార్త చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్, అమరావతి మధ్య దీన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తాజాగా రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీపీఆర్లు సిద్ధం చేసి పనులు ప్రారంభించనుంది. అటు, త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఆర్ఆర్కు ఉత్తరభాగం నుంచి హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

## వర్గీకరణ చేయాల్సింది ఉద్యోగాల్లో కాదు... ప్రభుత్వ కాంట్రాక్టుల్లో చేయాలి...

*-కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగాన్ని రచించి, భారతదేశానికి ఇచ్చిన మహా మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ కొనియాడారు. మంగళవారం విజయవాడ ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు 10, 20 అడుగులో ఉన్న అంబేద్కర్, 125 అడుగుల ఎత్తుకు ఎదిగారన్నారు. 40 సం.ల క్రితం అంబేద్కర్ వేరు, నేడు వేరు. దీనికి మొట్టమొదటి కారణం కాన్సీరాం, రెండో కారణం అంబేద్కర్ తెలివి తేటలు, ఆయన నీతి, నిజాయితీ అన్నారు. ప్రధాని మోడీ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ బాగా రాయించలేదు, నలిపేశారని చేసిన వ్యాఖ్యలు నిజం కాదు అన్నారు. అమెరికా, రష్యా, బ్రిటన్, చైనాలో కూడా ఇటువంటి రాజ్యాంగం లేదు అన్నారు. 500 కోట్ల రూపాయిలు ఢల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో పట్టుబడ్డది దానికి కారణం ఎవరు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం వైఫల్యం ఉందన్నారు. అంత డబ్బు ఆ జడ్జి ఇంట్లోకి ఎలా వెళ్ళింది ఎవరిచ్చారు, ఎప్పుడు ఇచ్చారు ఎంత ఇచ్చారు అనే దానిపై 48 గంటల్లో ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ ప్రజలకు ఆల్ ఇండియా రేడియో ద్వారా జవాబు చెప్పాలి. లేదంటే రాజీనామా పెట్టాలని డిమాండ్ చేస్తున్నాను. ఒక రిట్మెర్డ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిదని ఢల్లీలో సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు చెప్పుకుంటున్నారన్నారు. అందరూ అనుకున్నట్లు ఆ న్యాయమూర్తి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగలేదు. పని మనిషికి కడుపు మండి, నిప్పు పెట్టడం వల్ల, 500 కోట్ల రూపాయలు వెలుగులోకి వచ్చిందన్నారు. మాల-మాదిగ వర్గీకరణ మాట్లాడుతూ వర్గీకరణ చేయాల్సింది ఉద్యోగాల్లో కాదు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో చేయాలి అని డిమాండ్ చేశారు. మాల, మాదిగలకు చీమకుర్తి గ్రానైట్ గనుల్లో వర్గీకరణ కావాలి. టీటీడీలో 500 షాపులు ఇచ్చారు. అందులో ఒక్కరైనా ఎస్సీ ఉన్నారా అని ప్రశ్నించారు. గ్రానైట్ గనులు, ఇసుక, మైన్స్, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ కావాలి. జాతీయ బ్యాంకుల రుణాల్లో వర్గీకరణ జరగాలి అన్నారు. కర్ణాటక ప్రభుత్వం కాంట్రాక్ట్ పనుల్లో 24% ఎస్సీ, ఎస్టీలకు, 15% ఓబీసీలకు ఇస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో కూడా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కృష్ణ నది తీరాన శ్రీ వైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా నగరంలోని బబ్బూరి గ్రౌండ్స్ లో శ్రీ వైష్ణవ మహాదేవ క్షేత్ర సేవ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి దూపుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.... పెనుమాక గ్రామంలో కల శ్రీ వైష్ణవ మహాదేవ క్షేత్రంలో 365 రోజులపాటు 365 రోజులపాటు అఖండ శ్రీ హనుమాన్ పారాయణ కార్యక్రమం నిర్వహించమన్నారు. ముగింపు కార్యక్రమానికి సంకేతంగా బాబూరి గ్రౌండ్స్‌లో ఈ నెల 7 నుండి 13 వ తేదీ వరకు 50 వేల మంది భక్తులతో హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేశామన్నారు. శ్రీవారి నమూనా ఆలయాన్ని రూపొందించి తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు నిర్వహిస్తున్నామని అన్నారు. . ఏడాది పాటు నిర్విరామంగా హనుమాన్ చాలీసా పారాయణం చేసిన భక్తులను అయోధ్య రామమందిర దర్శనానికి తీసుకువెళ్తామని చెప్పారు. అనంతరం ప్రముఖ గాయకులు ఎం.ఎస్ రామారావు మనువడు ఎం.ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుండి 8 గంటల వరకు సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తామని వివరించారు.శ్రీవారి నమూనా ఆలయాన్ని రూపొందించి తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు నిర్వహిస్తూ శ్రీ వైష్ణవ మహాదేవ క్షేత్ర సేవ సంఘం ఇంతటి బృహత్తర కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు.

## విశ్వశాంతి కొరకు హనుమాన్ చాలీసా పారాయణం మహా యజ్ఞం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విశ్వశాంతి కొరకు భారత దేశం సుభిక్షంగా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో దత్త పీఠం అధిపతులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం మహా యజ్ఞం చేస్తున్నారు. దీనిని పురస్కరించుకుని శనివారం పటమట, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలో భవానీపురంలోని పున్నమి ఘాట్ వద్ద బబ్బూరి గ్రౌండ్ నందు వేల మంది భక్తులతో కలసి ఏక కాలం చాలీసా పారాయణం చేసి భగవంతుని ప్రార్థిస్తూ విశ్వ శాంతి కొరకు భారత దేశం పాడి పంటలతో ఆర్థికాభివృద్ధి చెందాలనే సంకల్పంతో మహా యజ్ఞం చేస్తున్నట్లు తెలిపారు. 33గంటల 33 నిమిషాలపాటు మైసూర్‌లో హనుమాన్ చాలీసా కదలకుండా పారాయణము చేసి గిన్నిస్ రికార్డ్ చేశామన్నారు. హనుమంతుడు కార్యసిద్ధి చేకూరుతాడు. హనుమంతుడు రాముల వారి కష్టాన్ని సీతమ్మ వారి కష్టాలను తీర్చిన అత్యంత శక్తి శాలి. హనుమంతుని కీర్తించి వేడుకుంటే ఆదే ప్రదేశంలో తాను ఏదో రూపంగా వచ్చి భక్తులను కాపాడుతాడన్నారు. హనుమాన్‌చాలీసాను ఒక మహా యజ్ఞం చేసుకోని ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వేల మంది భక్తులతో ఏక కాలం ముక్తకంఠంతో సాముహికంగా చాలీసాను గానం చేసాం. మన దేశంతో పాటు విదేశాల్లో కూడా యువకులు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో హనుమాన్ టెంపుల్ నిర్మాణం జరిగింది. హిందువులుగా అమెరికా వాసులు అనేక మంది ఆ ఆలయాన్ని సందర్శించి స్వామికి ముడుపు కట్టి తమ కోర్కెలను తీర్చమని వేడుకుంటున్నారన్నారు. హనుమంతుడిని మనం నిత్యం వహించాల్సిన అవసరం ఉందన్నారు. మహా విష్ణు తర్వాత హనుమంతుడే అని తెలిపారు. పున్నమి ఘాట్‌లో 18 సార్లు హనుమాన్ చాలీసా పఠనం జరుగుతుందన్నారు. మధ్య మధ్యలో సుందరకాండ వివరిస్తామన్నారు. ప్రతి ఒక్కరు హాజరై సామూహిక హనుమాన్ చాలీసాలో పాల్గొనాలని కోరారు. స్వామికి చాలా ముఖ్యమైన ఈ రోజు సామూహిక హనుమాన్ చాలీసాలో పాల్గొనటం మంచిందని తెలిపారు.

## వైష్ణవీ .. ఇలాగైతే ఎలాగంటున్న ఫ్యాన్స్!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఈ మధ్య కాలంలో కుర్రాళ్లను ఎక్కువగా ప్రభావితం చేసిన పేరు వైష్ణవీ చైతన్య. 'బేబి' సినిమాతో ఈ బ్యూటీ యూత్ ను ఒక్కసారిగా తనవైపుకు తిప్పేసుకుంది. ఆ సినిమాలో ఆమె చాలా గ్లామరస్ గా మెరిసింది. తెలుగు నుంచి వచ్చిన హీరోయిన్ గా కూడా ఆమె మరికొన్ని మార్కులను కొట్టేసింది. ఇతర భాషల నుంచి వచ్చి ఇక్కడ దూసుకుపోతున్న బ్యూటీలకు వైష్ణవీ చైతన్య కంగారు పుట్టించిందని చెప్పుకున్నారు. కొంతకాలం పాటు ఆమె హవా కొనసాగడం ఖాయమనే అభిప్రాయానికి వచ్చారు. ఈ నేపథ్యంలోనే వైష్ణవీ 'లవ్ మీ' అనే సినిమా చేసింది. రొమాంటిక్ హారర్ థ్రిల్లర్ జోనర్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వైష్ణవీ చైతన్య కోసమే ఆడియన్స్ ఈ సినిమాకి వెళ్లారు. అయితే వాళ్లు ఆశించిన స్థాయిలో ఆమె పాత్ర ఆకట్టుకోలేకపోయింది. ఆమె పాత్రలో విషయం లేకపోవడం వాళ్లను చాలా నిరాశ పరిచింది. పాత్రల ఎంపికలో వైష్ణవి కొంచెం కేర్ఫుల్ గా ఉండాలనే కామెంట్స్ వినిపించాయి. ఈ రోజున విడుదలైన 'జాక్' సినిమా విషయంలోనే ఆమెకి అవే కామెంట్స్ ఎదురవుతున్నాయి. ఈ సినిమాలో ఆమె పాత్రకి ఎంతమాత్రం ప్రాధాన్యత లేదనీ, అలాంటి పాత్రను ఆమె చేయకుండా ఉండాల్సిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సినిమాలలో హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వడం .. ఫస్టు సినిమాతోనే విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. అయితే అసలైన పరీక్ష, వచ్చిన క్రేజ్ ను నిలబెట్టుకోవడమేనని చెప్పాలి. అలా జరగాలంటే కథల ఎంపిక .. పాత్రల ఎంపిక విషయంలో గట్టి కసరత్తు జరగాలి. ఈ విషయంలోనే వైష్ణవీ మొహమాటానికి పోతున్నట్టుందనేది ఫ్యాన్స్ టాక్. ఇకనైనా ఆమె కేర్ఫుల్ గా ఉండాలని సలహా ఇస్తున్నారు.

**అనాలోచితంగా తొందరపడి ఏమీ చేయవద్దు..**
**చిత్తశుద్ధి, ఓర్పు, పట్టుదల ఈ మూడూ**
**కార్యసిద్ధికి ఆవశ్యకాలు, కానీ**
**ప్రేమ ఈ మూడింటికన్నా అత్యావశ్యకం..**
– స్వామి వివేకనంద

## నగరంలో కృష్ణ సాంమ్ సియారామ్ హాస్పిటల్ ప్రారంభం

**- ప్రారంభించిన శాసనసభ్యులు బోండా ఉమా, గద్దె రామ్మోహన్**

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన కృష్ణ సాంమ్ సియారామ్ హాస్పిటల్‌ను శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, ఉమామహేశ్వరరావులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైద్య సేవలో చిన్నారుల వైద్య సేవలు అనేవి అత్యంత కీలకమైన



వన్నారు. అలాంటి చిన్నారులకు అత్యవసరమైన ఆధునిక వైద్య సేవలను, అందుబాటులోకి తీసుకువచ్చిన హాస్పిటల్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పీడియాట్రిషన్ డాక్టర్ ఎం.నీలిమ మాట్లాడుతూ సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులో ఉండాలని లక్ష్యంతో హాస్పటల్ స్థాపించామన్నారు. అన్ని వైద్య సేవలో చిన్నారుల వైద్య సేవలు అనేవి అత్యంత క్లిష్టమైన వైద్య సేవలన్నారు. అలాంటి చిన్నారుల వైద్య సేవలలో అన్నిరకాల పీడియాట్రిక్ ఎమర్జెన్సీ ఎన్.ఐ.సి యూ, పి.ఐ.సి.యూ, పిల్లల యూనిట్, గర్భిణీ స్త్రీల గర్భస్థ శిశు ప్రత్యేక విభాగము, అన్ని రకాల మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ మాలేపాటి షాలిని, డాక్టర్ హిమ వర్ష తదితరులు పాల్గొన్నారు.

## స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు హాలిడే మినహాయింపు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు శనివారం రోజు రెండవ శనివారం సెలవు దినాన్ని తొలగించినట్లు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల సౌకర్యార్థం రేపు రెండవ శనివారం హాలిడేను తొలగించి యధా ప్రకారం రిజిస్ట్రేషన్‌లో కొనసాగే విధంగా ఉన్నతాధికారులు నిర్ణయించినట్లుగా తెలిపారు. రిజిస్ట్రేషన్లు వేగం పుంజుకుంటున్న ఈ సమయంలో ప్రజలు ఇబ్బందికి గురుకాకుండా వుండేందుకు శనివారం సెలవు దినంగా తీసుకుంటే రెండవ రోజు ఆదివారం వరుసగా రెండు రోజులు సెలవు దినాలు అయి సమయ జాప్యం అయ్యే అవకాశం వున్నందున అటు ప్రజలు ఇటు సిబ్బంది ఒక్కసారే రెండు రోజులు రిజిస్ట్రేషన్లు సంఖ్య పెరిగి ప్రజలకు సేవలందించే విషయంలో సమయాభావం కలగకుండా వుండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు సిబ్బందికి మధ్య అపోహలు లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలనే ప్రభుత్వ సూచనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే సెలవు దినాల వల్లగాని, సాంకేతికపరంగా కాని, సిబ్బంది లోపంగా కాని ఏవిధంగా కూడా రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు ఇబ్బంది పడకుండా సేవలు అందించాలన్నదే మా ఉద్దేశ్యమని తెలిపారు. బ్రోకర్లు, మధ్యవర్తుల బారిన పడకుండా నేరుగా రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చి తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరంగా నిర్వహించుకోవచ్చని ఎప్పుడూ తమ సిబ్బంది అందుబాటులో వుంటారని తెలిపారు. హాలిడే సమయాల్లో ప్రత్యేకంగా రూ. 5000లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం అమల్లో ఉంది. కానీ రేపు రెండో శనివారం మాత్రం రూ. 5000లను చెల్లించకుండానే రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా వెసులుబాటును ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నత అధికారులు, సబ్ రిజిస్ట్రర్లు తెలిపారు.

## మత బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ విచారణ జరపాలి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాలది హత్య నా దగ్గర ఆధారాలు ఉన్నాయి అని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ అన్నారు. విజయవాడ హోటల్ ఐలాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ వీడియోలో ఉన్నది అసలు ప్రవీణ్ కాదని డూప్ ప్రవీణ్ 22 రోజులు గడుస్తున్నా పోస్ట్‌మార్టం రిపోర్ట్ బయటపెట్టకుండా ఇన్వెస్టిగేషన్ ఎలా క్లోజ్ చేస్తారని కేఏ పాల్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జితో కానీ, సీబీఐతో కానీ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. 24 ఏళ్లుగా ప్రవీణ్ పగడాలకు మద్యం తాగే అలవాటే లేదన్నారు. మత బోధకుడు ప్రవీణ్ పగడాల కేసుకు సంబంధించి ఎస్పీతో ముఖ్యమంత్రి చంద్రబాబు 45 నిమిషాలు ఎందుకు మాట్లాడారని అడిగారు. రాష్ట్రంలో ఎన్ని చర్చిలు ఉన్నాయో పవన్‌కళ్యాణ్ ఎందుకు ఆరా తీశారని అనుమానం వ్యక్తం చేశారు. మరో 100 మంది మత బోధకులను టార్గెట్ చేసినట్టు తనకు సమాచారం ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ట్రంప్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇక్కడ న్యాయం జరగకపోతే ఎఫ్‌బిఐ వరకూ కేసును తీసుకెళ్తానని అన్నారు. ప్రవీణ్ కేసుపై తాను ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ప్రవీణ్ భార్య ఇప్పుడు ఎక్కడ ఉందని, ఆమె మాట్లాడకుండా ఎవరు కంట్రోల్ చేస్తున్నారని కేఏ పాల్ ప్రశ్నించారు. జగన్, చంద్రబాబు ఇద్దరిలో ఎవరు అధికారంలో ఉన్నా వైయస్ వివేకానంద రెడ్డి కేసులో న్యాయం జరగలేదని చెప్పారు.

## ఆ హీరోయిన్‌ను అలా సెలెక్ట్ చేశాను: దర్శకుడు వంశీ

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దర్శకుడిగా వంశీ శైలి విభిన్నం... విలక్షణం. చాలా తక్కువ బడ్జెట్ లో భారీ హిట్లు ఇచ్చిన దర్శకుడు ఆయన. ఇక ఆయన సినిమాలో కథ ఏదైనా పాటలు హిట్టు. ఇప్పటికీ ఆ సినిమాలను మళ్లీ మళ్లీ చూసేవారున్నారు. పాటలను పదే పదే వినేవారు ఉన్నారు. అలాంటి వంశీ సినిమాలలో 'శ్రీకనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్' ఒకటి. 1987లో విడుదలైన ఈ సినిమా, అప్పట్లో పెద్ద విజయాన్ని సాధించింది. తాజాగా తన వీడియోలో ఈ సినిమాను గురించి వంశీ ప్రస్తావించారు. ఈ సినిమాకి 'శ్రీకనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్– రాజమండ్రి' అనే టైటిల్ పెట్టాను. అయ్యబాబోయ్ టైటిల్ చాలా పెద్దది అయిందని అంతా అంటూ ఉంటే, చివర్లో ఉన్న 'రాజమండ్రి'ని తీసేశాను. అయినా టైటిల్ ఇంకా పొడుగ్గానే అనిపిస్తుందని అన్నారు. అయినా నేను ఇక పట్టించుకోలేదు. ఈ సినిమాకి సంబంధించిన పనులను చేస్తూ వెళ్లాను" అని అన్నారు. "ఈ సినిమాలో హీరోగా నరేశ్ ను అనుకున్నాను. తాను విజయనిర్మలగారి కొడుకుననే గర్వం నరేశ్ కి ఎంతమాత్రం లేదు. ఇద్దరం కలిసి తిరిగేవాళ్లం. ఆయన ఎంత మంచివాడనేది అప్పుడే నాకు అర్థమైంది. ఆ తరువాత కోడంబాకం రోడ్ లో మేము వెళుతూ ఉంటే, గోడపై 'సంసారం అదు మిన్సారం' (సంసారం ఒక చదరంగం) పోస్టర్ చూశాను. ఆ పోస్టర్ లో పెద్దకళ్లతో ఉన్న అమ్మాయిని చూసి బాగుందని అనుకున్నాను. "ఆ సినిమాకి వెళ్లి థియేటర్లో కూర్చున్నాను. ఎప్పుడెప్పుడు ఆ అమ్మాయి తెరపైకి వస్తుందా అని ఎదురుచూస్తున్నాను. ఆ అమ్మాయి వచ్చింది... పోస్టర్ పై కంటే కూడా బాగుందని అనిపించింది. ఆ తరువాత ఆ అమ్మాయిని గురించి వాకబు చేస్తే, తన పేరు 'మాధురి' అని తెలిసింది. ఆఫీసుకి పిలిపించి ఫొటో సెషన్ పెట్టాను. నా సినిమాలో ఆమెనే హీరోయిన్ అని అనుకున్నాను. ఆ తరువాతనే కోట, మల్లికార్జున్ రావు, రాళ్లపల్లి, భరణిలను ఎంపిక చేయడం జరిగింది" అని అన్నారు.

## బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి..



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా షేక్ నాగుల్ మీరాను నియమించి ఆయనకు నియమాకపత్రాన్ని అందజేశారు. నాగుల్ మీరా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన లాకా వెంగళరావు యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ సమన్వయకర్తగా వ్యవహరించాడు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ దేశంలో బీసీ కులాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా బీసీల జీవితాలలో మార్పు రాలేదన్నారు. తమిళనాడులో బీసీల ఐక్య పోరాట ఫలితంగా 69 శాతం రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేశారు. అదే తరహాలో దేశవ్యాప్తంగా బీసీలు పోరాడి రిజర్వేషన్లు సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని, దేశవ్యాప్తంగా కులగణనతో పాటు బీసీ కులగణను కూడా చేపట్టాలని కోరారు. బీసీల రక్షణ కోసం వెంటనే చట్టాన్ని తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ సంఘం నేతలు కలిసి నాగుల్ మీరాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాయని మల్లాది స్వాతికి విశిష్ట మహిళా పురస్కారం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరానికి చెందిన శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, గాయని మల్లాది స్వాతికి 2025 సంవత్సరానికి గానూ విశిష్ట మహిళా పురస్కారం ఆమె ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన బల్లెం వేణుమాధవ్ ఆర్ట్స్ థియేటర్ సంస్థ ప్రతీ ఏటా దేశంలో వివిధ రంగాలలో సేవలను అందించిన వారికి విశిష్ట మహిళా పురస్కారం అందిస్తుంది. 2025 సంవత్సరానికి గానూ స్వాతికి ఈ పురస్కారం లభించింది. శనివారం హైదరాబాద్ లోని తెలుగు చలన చిత్రమండలి హాల్‌లో సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. స్వాతి నగరం లోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో కర్నాటక సంగీతంలో శిక్షణ తీసుకున్నారు. దేశంలో వివిధ ప్రాంతాలలో కచేరీలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాలలో పాల్గొన్నారు. నగరానికి చెందిన పలు సంస్థలు ఆమెను అభినందించాయి.

## ఇ.ఎస్.ఐ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు

***కార్మిక శాఖ అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు***



విజయవాడ,నేటి పత్రిక ప్రజావార్త : ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు స్పష్టం చేసారు. శుక్రవారం ఉదయం విజయవాడ ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌ను సందర్శించిన చంద్రుడు, ఓపీ రిజిస్ట్రేషన్, లాబరేటరీ, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ విభాగాలను పరిశీలించారు. రోగుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వైద్య సేవలు మరింత ప్రభావవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ధన్వంతరి ఆన్లైన్ రిజిస్ట్రేషన్, ఆధార్ అనుసంధానం వంటి అంశాలను సమీక్షించిన చంద్రుడు, రిజిస్ట్రేషన్ వ్యవస్థను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. చందాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసిన చంద్రుడు, ఇ.ఎస్.ఐ డైరెక్టర్ వి. ఆంజనేయులకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వి. జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నా సినిమాలలో నాకు నచ్చింది అదే: నటి శారద!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : శారద .. ఒకప్పుడు వెండితెరపై వెలిగిపోయిన కథానాయిక. ఊర్వశిగా బిరుదును అందుకున్న శారద, వాయిస్ పరంగా కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలలో రాణించిన హీరోయిన్స్ లో శారదనే ముందుగా కనిపిస్తారు. అలాంటి శారద వయసు పైబడిన కారణంగా చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. తాజాగా ఒక యూ ట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మాది తెనాలి .. నా అసలు పేరు 'సరస్వతి'. నేను ఇండస్ట్రీకి వచ్చేసరికి ఆ పేరుతో కొంతమంది ఆర్టిస్టులు ఉన్నారని తెలిసి మా నాన్నగారు 'శారద' అని మార్చారు. నిజానికి నేను సినిమాలలోకి రావడం మా నాన్నగారికి ఇష్టం ఉండేది కాదు. మా అమ్మ ప్రోత్సాహం వల్లనే నేను ఇండస్ట్రీకి వచ్చాను. నేను చేసిన చాలా సినిమాలు విజయవంతమయ్యాయి. వాటిలో నాకు బాగా నచ్చిన సినిమా 'మనుషులు మారాలి'. ఆ సినిమాను 4 భాషలలో తీస్తే .. నాలుగు భాషల్లోను హీరోయిన్ గా నేనే చేశాను" అని అన్నారు. "ఎన్టీఆర్ .. ఏఎన్నార్ .. కృష్ణ .. శోభన్ బాబు .. కృష్ణంరాజు .. ఇలా అందరితో చేశాను. ఎన్టీఆర్ గారి సినిమాలలో నా పాత్రకి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఆయన ఏమీ అనేవారు కాదు. అలా నాకు మంచి పేరు రావడానికి ఆయన ఒక కారణమని చెప్పొచ్చు. వారి సినిమా సెట్లో నేను ఉంటే .. బసవతారకం గారు వచ్చి పలకరించేవారు. అలాంటివారి అభిమానాన్ని పొందడం నిజంగా నేను చేసుకున్న అదృష్టం అనే చెప్పాలి" అన్నారు. "శోభన్ బాబు గారు అందరితోను చాలా కలుపుగోలుగా ఉండేవారు. ఆ ప్రవర్తన కారణంగా అందరూ అభిమానంతో ఉండేవారు. అప్పట్లో ఆయన భూమిపై పెట్టుబడి పెట్టడం వలన ఆయన బిడ్డలంతా హ్యాపీగా ఉన్నారు. నాతో కూడా చెప్పారు .. కానీ నేను దానిని అంత సీరియస్ గా తీసుకోలేదు. అయినా భగవంతుడు ఇచ్చిన దానిలో నేను సంతృప్తితోనే ఉన్నాను. నా స్థాయిలో నేను సేవా కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నాను" అని చెప్పారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఛలో కమీషనరేట్


### జీవో 84 ప్రకారం సమాన పదోన్నతులు, సర్వీసు అవకాశాలు కల్పించాలి

**-పిఎంటీఎఫ్ అధ్యక్షులు సోమరౌతు శ్రీనివాసరావు**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వాన్ని ఇచ్చిన ఉత్తర్వులు ప్రభుత్వమే పాటించటం లేదు వాటిని అమలు చేయడం లేదు అని ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు సోమరౌతు శ్రీనివాసరావు అన్నారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను జిల్లా పరిషత్ కి జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను మున్సిపాలిటీకి వేశారు. మున్సిపల్ టీచర్స్ పరిపాలన బాధ్యతలు పర్యవేక్షణ బాధ్యతలు స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్ర ప్రదేశ్ వారికి అప్పగిస్తూ జీవో నెంబర్ 84 విడుదల చేశారు. గత మూడు సంవత్సరాలుగా మున్సిపల్ ప్రధాన ఉపాధ్యాయులకు డిడిఓ అధికారులు అరకొర పదోన్నతులు అంట కడుతున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్ర ప్రదేశ్ వారు మున్సిపల్ టీచర్స్ కి చేసిన మేలు ఏమి లేదు. జిల్లా పరిషత్ మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాదిరిగా సర్వీస్ రూల్స్ డ్రాఫ్ట్ బిల్లు తయారుచేసి పక్కన పెట్టారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇవ్వటం లేదు.మూడు సంవత్సరాల నుంచి మంగళగిరి స్కూల్ లో40 పోస్టులు భర్తీ చేయకుండానే బయటనుంచి కొత్త వారిని తీసుకొచ్చి ఆ స్కూల్లో వేస్తున్నారు. మున్సిపల్ టీచర్ తమ సమస్యలు పరిష్కారణకై ఏప్రిల్ 17వ తేదీ ఉదయం 10:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ధర్నా నిర్వహిస్తున్నాం,తెలుగుదేశం పార్టీ ఆఫీసు ఎదురు ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీస్ ఎదురుగా ధర్నా చేయడం నిర్ణయించుకున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమంత్, సి. కామేష్, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ ప్రారంభించిన నటి సంయుక్త మీనన్




గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : మన్నికైన నాణ్యత గల ఆభరణాల సంస్థ గోయాజ్ తాజాగా 11వ స్టోర్ గుంటూరు లక్ష్మీపురంలోని గోయాజ్ లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ ప్రముఖ నటి సంయుక్త మీనన్ ప్రారంభించారు. సినీనటి సంయుక్త మీనన్ మాట్లాడుతూ...గోయజ్ సిల్వర్ జ్యూవెలరీ షోరూం ప్రారంభోత్సవం లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది. నేడు యువతులు అందంగా కనిపించేందుకు ఈ జ్యూవెలరీ ఎంత ఉపయోగకరంగా ఉంటుంది. ఈ షోరూం లో మంచి సిల్వర్ జ్యూవెలరీ కలెక్షన్లు ఉన్నాయి. గుంటూరు కు నేను మూడు సార్లు వచ్చాను. నేను హీరోయిన్గా బాలకృష్ణ హీరోగా అఖండ 2 త్వరలో రిలీజ్ కాబోతుంది అని తెలిపారు. గోయాజ్ స్టోర్ ప్రారంభం సందర్భంగా ఏప్రిల్ 12 నుండి ఏప్రిల్ 20 వరకు అద్భుతమైన ఆఫర్లను మీకు కోసం తీసుకువచ్చింది. గొప్ప ప్రారంభ ఆఫర్లతో సహా దాని విస్తృత సేకరణలతో మిమ్మల్ని ఆనందం చేస్తుంది. రూ. 1,00,000 విలువైన వెండి ఆభరణాలను కొనండి మరియు రూ 50,000 విలువైన డైమండ్ నెక్లెస్ మరియు చెవిపోగులు పొందండి. రూ 50,000 విలువైన వెండి ఆభరణాలు కొనండి మరియు రూ 25 వేల విలువైన టెంపుల్ ఆభరణాల గొలుసు ఉచితంగా పొందండిరూ 25 వేల విలువైన వెండి ఆభరణాలు కొనండి మరియు రూ 12,500 విలువైన గుండు మల్లా నెక్లెస్ పొందండి. నిర్వహకులు రవితేజ వేములూరి మరియు ప్రియాంక వేములూరి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్నేలు పొందిన ఏకైక సిల్వర్ జ్యూవెలరీ స్టోర్ గోయాజ్ మా వద్ద అన్ని వెండి ఆభరణాలు 92.5 హాల్మార్క్ మరియు 22 కే గోల్డ్ ప్లేటెడ్ మరియు మీరు 55% ప్రత్యేకమైన రిటర్న్ విలువతో రూ.50,000 కంటే ఎక్కువ డిజైన్ల నుండి ఎంచుకోవచ్చు (మీరు జీవితకాలానికి దానిని మార్పిడి చేయవచ్చు). ఇంకా ఏమిటంటే, మీకు సౌకర్యవంతంగా ఉండటానికి, విదేశీ క్లయింట్ల కోసం ఫ్రీ పాన్ ఇండియా డెలివరీ ప్రయోజనం మరియు గ్లోబల్ షిప్పింగ్ తో మీరు ఎక్కడి నుండైనా షాపింగ్ చేయడానికి అనుమతించే వీడియో కాలింగ్ సౌకర్యం మాకు ఉంది. భారతదేశంలో గోయాజ్ వారి అతిపెద్ద లగ్జరీ వెండి ఆభరణాల దుకాణాన్ని అనుభవించడానికి సిద్ధంగా ఉండండి.

## "రన్ ఫర్ జీసస్"ను జయప్రదం చేయండి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న (శనివారం) "రన్ ఫర్ జీసస్"ను నిర్వహిస్తున్నామని దీనిని అన్ని క్రైస్తవ సంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నామని మాజీ డిప్యూటి మేయర్ సిరిపురపు ఫిలిప్స్ గ్రిటన్, కాండ్రు సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 6.00 గం.కు బెంజ్ సర్కిల్ సెయింట్ పాల్స్ కెథడ్రల్ నుండి 5వ నెంబర్ రోడ్ నుండి సిఎస్ఐ సెయింట్ బాసిలికా వరకు యేసు క్రీస్తు పునరుదనాన్ని"రన్ ఫర్ జీసస్" (యేసు కొరకు పరుగు) వుందన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు ఒకే వేదిక మీదకు వచ్చి నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వనజీవి రామయ్య కన్నుమూత



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మొక్కల ప్రేమికుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య ఈ తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన వయసు 85 సంవత్సరాలు. జీవితమంతా మొక్కలు నాటి పెంచిన ఆయన ఇంటి పేరే వనజీవి అయింది. రామయ్య స్వగ్రామం ఖమ్మం జిల్లాలోని రెడ్డిపల్లి. కోటికిపైగా మొక్కలు నాటిన రామయ్య సరికొత్త రికార్డు సృష్టించారు. 2017లో రామయ్యను భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.